సాక్షి
పశ్చిమగోదావరి
మంగళవారం । 20 । ఆగస్టు । 2024



ఉపాధిలో రూ.2 కోట్లు హాంఫట్

ఉపాధి హామీ పథకంలో భాగంగా గత ఏడాది నూజివీడు నియోజకవర్గంలో చేసిన పనుల్లో రూ.2 కోట్ల మేర అవినీతి జరిగినట్లు సామాజిక తనిఖీలో అధికారులు నిర్ధారించారు. 8లో



ఉల్లి లొల్లి మళ్లీ షురూ

ఉల్లి ధర మళ్లీ క్రమంగా పెరుగుతోంది. తాడేపల్లి గూడెం మార్కెట్ సరుకు రాక తగ్గడంతో కిలో ధర రూ.50కు చేరుకుంది. ధర మరింత పెరిగే అవకాశం ఉందని చెబుతున్నారు. 8లో




రసాయనం.. మితిమీరితే అనర్థం

వరి సాగులో రసాయన మందులు మోతాదు మించి వినియోగిస్తే నష్టాలు తప్పవని, భూసారం క్షీణిస్తుందని వ్యవసాయ నిపుణులు హెచ్చరిస్తున్నారు. 8లో

న్యూస్‌రీల్

లక్ష గాజులతో కనకదుర్గమ్మకు అలంకరణ



గాజుల అలంకరణలో కనకదుర్గమ్మవారు

భీమవరం : పౌర్ణమి సందర్భంగా శ్రీరాంపురం రోడ్డులోని శ్రీ జగన్మాత కనకదుర్గ అమ్మవారికి సోమవారం లక్ష గాజులతో అలంకరణ చేశారు. ఆలయ అర్చకులు బ్రహ్మజ్యోసుల ప్రసాద్, సుబ్రహ్మణ్యం అమ్మవారికి సుగంధ ద్రవ్యాలు, పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. అనంతరం లక్ష గాజులు, 1000 రవికెలు, పసుపు కుంకుమలతో పూజ చేసి ప్రత్యేక అలంకరణ చేశారు. మంగళవారం ఉదయం అమ్మవారికి అలంకరణ చేసిన గాజులు, రవికెలను భక్తులు అందజేయనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్షులు పితాని సత్యనారాయణ, పొన్నా రంగారావు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

28న ఫెర్రీ లీజు వేలం

సాక్షి స్పందన

నరసాపురం రూరల్ : మాధవాయిపాలెం ఫెర్రీ లీజు వేలంపై ఈ నెల 28వ తేదీన రేవు పాట నిర్వహించేందుకు అధికారులు నోటిఫికేషన్ జారీ చేశారు. 'మాధవాయిపాలెం ఫెర్రీ వేలం జరిగేనా?' శీర్షికతో ఈ నెల 16వ తేదీన 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై మండల, జిల్లా పరిషత్ అధికారులు స్పందించారు. లీజు వేలం ప్రారంభపు పాట ధర రూ.2.97 కోట్లుగా నిర్ణయించారు. సీల్డ్‌కం బహిరంగ పద్ధతిలో వేలం నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకున్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): గురుపూజోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు అందించనున్నామని, ఇందుకుగాను అర్హులైన ఉపాధ్యాయుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత కలిగిన ఉపాధ్యాయులు ఈ నెల 28వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు తమ దరఖాస్తులను జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో సమర్పించాలన్నారు. దరఖాస్తు నమూనాను సంబంధిత తనిఖీ అధికారుల నుంచి పొందవచ్చన్నారు. నిర్దేశించిన నమూనా ప్రకారమే ప్రతిపాదనలు సమర్పించాలని, దరఖాస్తులను జిల్లా కమిటీ పరిశీలన అనంతరం వారికి వచ్చిన మార్కుల ప్రకారం ఎంపిక ప్రక్రియ జరుగుతుందన్నారు.

శ్రీవారి క్షేత్రంలో పెళ్లిళ్ల సందడి



శ్రీవారి ఆలయ అనివేటి మండపంలో జరుగుతున్న వివాహం

ద్వారకాతిరుమల: శ్రీవారి క్షేత్రం పెళ్లిళ్ల సందడితో కళకళలాడుతోంది. శ్రావణమాసంలో మంచి ముహూర్తాలు కావడంతో ఆదివారం రాత్రి భారీగా వివాహాలు జరిగాయి. దీంతో క్షేత్ర పరిసరాలు బాజాభజంత్రీలు, పురోహితుల వేద మంత్రోచ్ఛరణలతో మారుమోగాయి. ఎటు చూసినా పెళ్లి జనాలు, నూతన వధూవరులతో ఆలయ పరిసరాలు సందడి వాతావరణం నెలకొంది. ప్రైవేట్, దేవస్థానం కల్యాణ మండపాలు, ఆలయ తూర్పు రాజగోపుర ప్రాంతం, అనివేటి మండపం, అలాగే పాదుకా మండపం వద్ద ఉన్న శ్రీవారి కల్యాణ మండపంలో సుమారు 300 వరకు వివాహాలు జరిగాయి. ఈ నెల 23న రాత్రి సైతం భారీగా వివాహాలు జరుగుతాయని పురోహితులు చెబుతున్నారు.

రుణాల కోసం మైనార్టీలు దరఖాస్తు చేసుకోండి

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : జిల్లాలో వ్యక్తిగత, గ్రూపు రుణాల కోసం అర్హులైన మైనారిటీ (ముస్లిం, క్రిష్టియన్, సిక్కులు, బుద్ధిష్టు, పార్సీ, జైన్) అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మైనారిటీ ఆర్థిక సంస్థ ఇన్‌చార్జి కార్యనిర్వాహక సంచాలకులు ఎన్ఎస్ కృపావరం సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్, కలెక్టరేట్ కాంపౌండ్, ఏలూరు లేదా 08812-242463 నంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించవచ్చన్నారు.

చికెన్‌కు శ్రావణం ఎఫెక్ట్

- తగ్గిన వినియోగం.. కిలో రూ.200కు పడిపోయిన ధర
- ఉమ్మడి జిల్లాలో రోజూ 2.5 లక్షల కిలోల వినియోగం
- ప్రస్తుతం 50 శాతం మేర అమ్మకాలే: వ్యాపారులు
- పెళ్లిళ్ల సీజన్‌పైనే రైతుల ఆశలు

సాక్షి, భీమవరం: కొద్దిరోజుల క్రితం వరకు కిలో రూ. 300 పైగా పలికిన చికెన్ ధరకు శ్రావణం ఎఫెక్ట్ తగిలింది. విష జ్వరాల విజృంభణ తోడైంది. వినియోగం తగ్గి ధర పతనమైంది. ప్రస్తుతం రూ.200కు చేరుకోగా పెళ్లిళ్ల సీజన్‌పైనే రైతులు గంపెడాశలు పెట్టుకున్నారు. మరోపక్క లేయర్ కోడిగుడ్డు ధర ఊగిసలాడుతోంది.

ఉమ్మడి జిల్లాలోని తణుకు, తాడేపల్లిగూడెం, జంగారెడ్డిగూడెం, పాలకొల్లు, పెనుగొండ, నరసాపురం తదితర ప్రాంతాల్లోని ఫాంలలో ఏడు లక్షలకు పైగా కోళ్లు పెంచుతున్నారు. జిల్లాల్లో రోజుకు 2.5 లక్షల కిలోల చికెన్ వినియోగిస్తుండగా, ఆదివారం, పండుగ రోజుల్లో రెట్టింపు స్థాయిలో అమ్మకాలుంటాయి. బ్యాచ్ వేసిన ఐదు వారాల్లో రెండు కేజీల వరకు బరువు పెరిగి బ్రాయిలర్ కోళ్లు వినియోగానికి వస్తాయి. పండుగలు, పెళ్లిళ్ల సీజన్ బట్టి నిర్ణీత సమయానికి అందుబాటులోకి వచ్చేలా రైతులు ఎప్పటికప్పుడు కొత్త బ్యాచ్‌లు వేస్తుంటారు. మిగిలిన నెలలతో పోలిస్తే వరలక్ష్మి వ్రతం, వినాయక చవితి వేడుకలు, దేవీ నవరాత్రి ఉత్సవాలు, కార్తీక మాసం పూజల నేపథ్యంలో శ్రావణ మాసం నుంచి కార్తీక మాసం ముగిసే వరకు చికెన్ వినియోగం తగ్గుతుంది. పెళ్లి ముహూర్తాలు ఎక్కువగా ఉంటే కొంత మేర అమ్మకాలు బాగుంటాయి. ఆయా కారణాలతో ఆగస్టు నుంచి డిసెంబరు వరకు కొత్త బ్యాచ్‌లు వేయడాన్ని కొంత తగ్గిస్తుంటారు.

రూ.200కు తగ్గిన ధర

రెండు వారాల క్రితం వరకు రిటైల్ మార్కెట్‌లో చికెన్ కిలో రూ.300 నుంచి రూ.320 వరకు ఉంది. శ్రావణ మాసం మొదలుకావడం, మరో పక్క సీజనల్ జ్వరాల బెడద ఎక్కువగా ఉండటం ధరపై ప్రభావం చూపింది. మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ జ్వరాలకు భయపడి అధికశాతం మాంసాహారానికి దూరంగా ఉంటున్నారు. డిమాండ్ లేకపోవడంతో ధర పతనమవుతూ రూ.200కు చేరింది. సాధారణంగా రెండు కిలోల నుంచి 2.2 కిలోల బరువు వచ్చేసరికి ఫాంల నుంచి కోళ్లను మార్కెట్‌లోకి తెచ్చేస్తుంటారు. అమ్మకాలు లేకపోవడంతో ప్రస్తుతం మార్కెట్‌లోకి వస్తున్న కోళ్ల రెండున్నర కిలోల పైగా బరువుంటున్నాయి. రెండు వారాల క్రితంతో పోలిస్తే అమ్మకాలు సగానికి తగ్గిపోయాయని వ్యాపార వర్గాలంటున్నాయి. ధర లేకపోవడంతో తీవ్రంగా నష్టపోవాల్సి వస్తుందని కోళ్ల రైతులు అంటున్నారు. పెళ్లిళ్ల సీజన్ అమ్మకాలపైనే వారు గంపెడాసలు పెట్టుకున్నారు.



ఒడిదుడుకుల మధ్య గుడ్డు ధర

లేయర్ కోడి గుడ్డు ధర ఒడిదుడుకులకు గురవుతోంది. ఉమ్మడి జిల్లాలోని తణుకు, తాడేపల్లిగూడెం, జంగారెడ్డిగూడెం, దేవరపల్లి, ఉండ్రాజవరం తదితర మండలాల్లో సుమారు 250 పౌల్ట్రీలు విస్తరించి ఉన్నాయి. 1.3 కోట్ల వరకు గుడ్లు పెట్టే కోళ్లు ఉండగా రోజుకు 1.05 కోట్ల గుడ్లు ఉత్పత్తి అవుతున్నాయి. 70 శాతం గుడ్లు పశ్చిమ బెంగాళ్, ఒడిశా, బిహార్ తదితర రాష్ట్రాలకు ఎగుమతి అవుతుండగా మిగిలినవి స్థానికంగా వినియోగిస్తున్నారు. జిల్లా నుంచి ఎగుమతులు జరిగే ఉత్తరాది రాష్ట్రాల్లో మనకంటే రెండు వారాల ముందుగానే శ్రావణ మాసం మొదలవుతుందని పౌల్ట్రీ వర్గాలంటున్నాయి. శ్రావణంలో జిల్లా నుంచి ఎగుమతులకు డిమాండ్ తగ్గి రైతు ధర పతనమవుతుంది. ఈ క్రమంలో జూలై 18 నాటికి రూ.5.55గా ఉన్న రైతు ధర క్రమంగా తగ్గుతూ ఆగస్టు రెండో వారం నాటికి రూ.4.26కు చేరింది. కొద్ది రోజులుగా పుంజుకోవడం మొదలై సోమవారం నాటికి రూ.5.01కు చేరింది. మరింత పెరుగుతుందన్న రైతుల ఆశలపై నీళ్లు చల్లుతూ మంగళవారం నాటి నెక్ ప్రకటిత రైతు ధర రూ.4.75కు తగ్గిపోయింది. ధరలో హెచ్చు తగ్గులు కోళ్ల రైతులను కలవరపెడుతోంది.

అర్జీల పరిష్కారంలో అలసత్వం వద్దు



మీకోసంలో ఓ వృద్ధురాలి అర్జీని పరిశీలిస్తున్న కలెక్టర్ సి.నాగరాణి

భీమవరం (ప్రకాశం చౌక్) : మీ కోసంలో అందిన అర్జీలకు నాణ్యతతో కూడిన సత్వర పరిష్కారాన్ని అందించాలని, అర్జీల పరిష్కారంలో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని కలెక్టర్ చదలవాడ నాగరాణి హెచ్చరించారు. సోమవారం కలెక్టరేట్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దరఖాస్తులను నిర్దేశించిన గడువులోగా పరిష్కరించాలన్నారు. పీజీఆర్ఎస్ (మీ కోసం) నిర్వహణపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ప్రతి అర్జీని పరిశీలించి ఎండార్స్‌మెంట్ ఇవ్వాలన్నారు.

'నులి పురుగుల నిర్మూలన' సెప్టెంబర్‌కు వాయిదా

జిల్లాలో ఈ నెల 20వ తేదీన నిర్వహించాల్సిన జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమాన్ని సెప్టెంబర్ 17వ తేదీకి వాయిదా వేసినట్లు కలెక్టర్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏడాదిలో రెండు సార్లు నిర్వహించే ఈ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడీ కేంద్రాలు, విద్యా సంస్థలలో ఉన్న 1-19 సంవత్సరాల పిల్లలకు అల్బెండజోల్ మాత్రలు వేస్తారన్నారు.

జిల్లా భవిష్యత్ ప్రణాళిక సిద్ధం చేయండి



భీమవరం కలెక్టరేట్‌లో అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ సి.నాగరాణి

భీమవరం (ప్రకాశం చౌక్): జిల్లాకు సంబంధించి వికసిత్ ఆంధ్రప్రదేశ్ భవిష్యత్ ప్రణాళిక (విజన్ డాక్యుమెంట్) సిద్ధం చేయాలని కలెక్టర్ చదలవాడ నాగరాణి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో వికసిత్ ఆంధ్రప్రదేశ్ భవిష్య ప్రణాళికపై వివిధ శాఖల జిల్లా అధికారులతో సమీక్షించారు. 2047 నాటికి వికసిత్ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమం కింద రాష్ట్ర సమగ్ర అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం రోడ్ మ్యాప్‌ను సిద్ధం చేస్తుందన్నారు. ఈ దిశగా ఏటా 15 శాతం వృద్ధిని సాధించే లక్ష్యంతో ముసాయిదా విజన్ డాక్యుమెంట్ ఖరారు దశలో ఉందన్నారు. జిల్లాలో కొబ్బరి ఉత్పత్తులు, లేసు అల్లికలు, ఆక్వా ఉత్పత్తులు ద్వారా ఇంకా మెరుగైన ప్రత్యామ్నాయ ఆదాయ మార్గాలను అన్వేషించి జోడించాలన్నారు. పర్యాటక, పారిశ్రామిక రంగాలను మరింత అభివృద్ధి చేయడం ద్వారా ఉపాధి అవకాశాలు ఎక్కువగా లభించి ప్రజల జీవన ప్రమాణాలు పెరుగుతాయని, ఈ విధంగా పరిశోధనాత్మక ఆలోచనలతో వివిధ శాఖలలో అందుబాటులో ఉన్న వనరులతో వృద్ధి సాధించేందుకు ఈ డాక్యుమెంట్ రూపొందించాలని కలెక్టర్ సూచించారు. డీఆర్వో జె.ఉదయభాస్కరరావు, జిల్లా ప్రణాళిక అధికారి ఎం.మోహన్‌రావు, జిల్లా గ్రామ వార్డు సచివాలయాల అధికారి కేసీహెచ్ అప్పారావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

'ఉద్యోగ దిక్సూచి' సద్వినియోగం చేసుకోవాలి

నరసాపురంలో ఈ నెల 23న నిర్వహించే ఉద్యోగ దిక్సూచి కార్యక్రమాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ అన్నారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, నేషనల్ కెరీర్ సర్వీస్ ఆధ్వర్యంలో నరసాపురం వైఎన్ డిగ్రీ కాలేజీలో నిర్వహించే ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో అమర రాజా గ్రూప్, షిరిడి సాయి సాఫ్ట్‌వేర్ కన్సల్టెన్సీ, జగదీష్ మెరైన్, సంధ్య మెరైన్, సూర్యామిత్ర ఎగ్జిమ్ ప్రైవేట్ లిమిటెడ్, టాటా మోటార్స్, ఇండస్ ఇండ్ బ్యాంకు, ముత్తూట్ ఫైనాన్స్, హెటిరో ఫార్మా, గ్రీన్ టెక్ ఇండస్ట్రీస్, బ్లూస్టార్ మొదలైన ప్రముఖ కంపెనీలు పాల్గొంటున్నాయన్నారు. సుమారు 450 పైగా ఉద్యోగావకాశాలు కల్పించే అవకాశం ఉందన్నారు. వివరాలకు నాగేంద్ర - 95020 24765, ప్రసన్న - 70138 96277, రాధిక - 94418 41622 నెంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

అనుబంధాల రాఖీ

భీమవరం (ప్రకాశం చౌక్)/నరసాపురం : పశ్చిమ గోదావరి జిల్లాలో రాఖీ పౌర్ణమి వేడుకలు సోమవారం ఘనంగా జరుపుకున్నారు. భీమవరంలో శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజుకు ప్రజాపిత బ్రహ్మకుమారి ఈశ్వరీయ విశ్వవిద్యాలయం భీమవరం శాఖ నిర్వాహకురాలు రాజయోగిని బ్రహ్మకుమారి రేవతి రాఖీ కట్టి స్వీట్స్ పంచారు. అలాగే నరసాపురంలో మాజీ ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజుకు మున్సిపల్ చైర్‌పర్సన్ బర్రి శ్రీవెంకట రమణ, వైస్ చైర్‌పర్సన్ కామన నాగిని, మహిళా కౌన్సిలర్లు ద్వారా గంగాభవానీ, సర్రా కాంతమ్మ రాఖీలు కట్టి హారతులు పట్టారు. ఈ సందర్భంగా కొయ్యే మోషేన్‌రాజు, ముదునూరి ప్రసాదరాజు మాట్లాడుతూ రాఖీ పౌర్ణమి పర్వదినం అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య అనుబంధం, ఆప్యాయత పెంపొందించే పండగ అని, విశ్వ సౌభ్రాతృత్వాన్ని, జాతీయ సమైక్యతను నెలకొల్పుతుందన్నారు.



భీమవరంలో శాసనమండలి చైర్మన్ కొయ్యే మోషేన్‌రాజుకు రాఖీ కడుతున్న దృశ్యం



మాజీ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజుకు రాఖీలు కడుతున్న మహిళా ప్రజాప్రతినిధులు

ఏపీ నిట్‌కు 3 ఐఎస్ఓ సర్టిఫికెట్లు



ఏపీ నిట్ ఏరియల్ వ్యూ

తాడేపల్లిగూడెం: ఏపీ నిట్‌కు ఇంటర్నేషనల్ ఆర్గనైజేషన్ ఫర్ స్టాండర్డైజేషన్ (ఐఎస్ఓ) సర్టిఫికెట్లు మూడు వచ్చినట్టు నిట్ అధికారులు సోమవారం చెప్పారు. ప్రభుత్వ విద్యాసంస్థలు, పరిశ్రమల్లో అనుసరిస్తున్న అత్యుత్తమ ప్రమాణాలు, ఉన్నత సదుపాయాలు, మౌలిక వసతులను పరిశీలించి ఐఎస్ఓ ధ్రువీకరణ పత్రాలను అందజేస్తారు. దీనిలో భాగంగా ఇటీవల ఐఎస్ఓ ప్రతినిధులు తాడేపల్లిగూడెం నిట్‌లోని గెస్ట్ హౌస్, భవనాలు, ప్రయోగశాలలు, యంత్రాల పనితీరు, ఇంజినీరింగ్ విభాగాలు, ఇతర సదుపాయాలను పరిశీలించారు. రికార్డుల నిర్వహణ, బోధన, బోధనేతర సిబ్బంది వివరాలు, విద్యార్థులకు కల్పిస్తున్న వసతులను అడిగి తెలుసుకున్నారు. 2015లో ఏర్పడి తక్కువ సమయంలోనే మంచి వృద్ధిని సాధించి ఇతర జాతీయ విద్యాసంస్థలతో పాటు పోటీపడటం అభినందనీయమని ప్రశంసిస్తూ ఏపీ నిట్‌కు మూడు ఐఎస్ఓ సర్టిఫికెట్లు ఇచ్చారు. క్వాలిటీ మేనేజ్‌మెంట్ సిస్టమ్ గుడ్ ఆఫ్ అకడమిక్, అడ్మినిస్ట్రేటివ్, ఐఎస్ఓ 9001, ఎన్విరాన్‌మెంటల్ గ్రీన్ ఆడిట్ సర్టిఫికెట్ 14001, ఎనర్జీ మేనేజ్‌మెంట్ సర్టిఫికెట్ 50001 వచ్చాయి. ఇన్‌చార్జి డైరెక్టర్ బీఎస్ మూర్తి, రిజిస్ట్రార్ దినేష్ శంకరరెడ్డి ఈ సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు. ఐఎస్ఓ గుర్తింపు కోసం సహకారం అందించిన వారికి అభినందనలు తెలిపారు.

స్మైల్ ప్లీజ్..

- కొత్తపుంతలు తొక్కుతున్న ఫొటోషూట్
- విస్తరిస్తున్న థీమ్స్ కల్చర్
- పట్టణాల్లో వెలుస్తున్న ప్రత్యేక స్టూడియోలు



మ్యూజిక్ పిక్చర్ ల్యాండ్ అవుట్ డోర్ సెట్టింగ్స్ వద్ద ఫొటో షూట్

సాక్షి, భీమవరం : ఫొటోగ్రఫీ ఎప్పటికప్పుడు కొత్త పుంతలు తొక్కుతూనే ఉంటుంది. ప్రీ వెడ్డింగ్, పోస్టు వెడ్డింగ్‌లకే కాకుండా వేడుకేదైనా మధురానుభూతులను చిరస్మరణీయం చేసేందుకు ఫొటో షూట్స్ వచ్చేశాయి. అందుకోసం ఎక్కడికి వెళ్లాల్సిన పనిలేకుండా ప్రత్యేక థీమ్స్‌తో స్టూడియోలు వెలుస్తున్నాయి. గతంలో నగరాలకే పరిమితమైన ఈ తరహా స్టూడియోలు ఇప్పుడు జిల్లాలో పది వరకు ఉన్నాయి. ఇప్పుడివే కొత్త ట్రెండ్‌గా చిన్నారుల తల్లిదండ్రులు, యువతను ఆకర్షిస్తున్నాయి. ఫొటోస్ దిగడం అంటే అందరికి సరదా. తమ జీవితంలోని మర్చిపోలేని ఆనందకర క్షణాలను కెమెరాలో బంధించాలనుకుంటారు. ప్రతి వేడుకను జీవితాంతం గుర్తుంచుకునేందుకు ఫొటోలు తీయించుకుంటారు. గతంలో పెళ్లిళ్లు, ఇతర వేడుకలకు ఫొటోలు తీయించుకునే వారు. ఇప్పుడు ప్రతి కార్యక్రమానికి ఫొటోలు తీసుకోవడం పరిపాటిగా మారింది. యువత కెమెరా తీసుకుని రోడ్లు పక్కన, వివిధ లోకేషన్లలో ఫొటోలు తీసుకోవడం కనిపిస్తోంది. పుట్టినరోజు వేడుకల కోసం తమ చిన్నారులకు ఫొటోషూట్‌లు చేయించడం ఇటీవల ఫ్యాషన్‌గా మారింది. వ్యయప్రయాసలకోర్చి నగరాలు, దూర ప్రాంతాలకు వెళ్లి ఫొటో షూట్‌లు చేయించడం అందరికి సాధ్యం కాదు.

వెలుస్తున్న థీమ్ స్టూడియోలు

గతంలో నగరాలకే పరిమితమైన థీమ్ స్టూడియోలు ఇప్పుడు చిన్నచిన్న పట్టణాల్లోను వెలుస్తున్నాయి. మారుతున్న అభిరుచులు, కొత్త ట్రెండ్‌కు అనుగుణంగా పల్లెటూరి నుంచి పాశ్చాత్య కల్చర్‌ను ప్రతిబింబించే విధంగా సెట్టింగ్స్‌ను ఏర్పాటుచేస్తున్నారు. చిన్నారుల కోసం ఏర్పాటుచేస్తున్న కోర్టు, హాస్పటల్, లైబ్రరీ, మిలటరీ గ్రౌండ్, బాహుబలి, కిచెన్, బాక్సింగ్ రింగ్ తదితర సెట్టింగ్‌లు ప్రత్యేక ఆకర్షణగా ఉంటున్నాయి. పిల్లలు ఆడుకునే బొమ్మలు, బైక్స్, కార్స్ ఇలా అన్నిరకాల బొమ్మలతో అందమైన ఫొటోలు తీసుకునేందుకు అవసరమైన ఏర్పాట్లు చేశారు. జిల్లాలోని భీమవరంలో ఐదు వరకు ఈ తరహా ఇన్‌డోర్, ఔట్‌డోర్ స్టూడియోలు ఉండగా తణుకు, పాలకొల్లు తదితర జిల్లా వ్యాప్తంగా పది వరకు స్టూడియోలు వెలిశాయి. ఫొటోగ్రఫీ రంగంలో ఉన్న వారు ఈ తరహా స్టూడియోల ఏర్పాటుకు ముందుకు వస్తున్నారు. ప్రీ, పోస్టు వెడ్డింగ్ షూట్స్, మెటర్నిటీ షూట్, బేబీ, న్యూ బార్న్, కేక్ స్మాష్, మెహందీ, హల్దీ షూట్స్ చేసుకునేందుకు సకల సదుపాయాలు ఇక్కడ ఉంటున్నాయి. మినీ థియేటర్‌తో పాటు కొన్నింటిలో బర్త్‌డే తదితర ఇన్‌డోర్, అవుట్‌డోర్ ఈవెంట్ల నిర్వహణకు వసతులు కల్పించారు. ఆయా సదుపాయాలను బట్టి గంటకు రూ.2 వేల నుంచి రూ.3 వేల వరకు చార్జి చేస్తున్నారు. గంటల ప్రాతిపదికన బయటి ఫొటోగ్రాఫర్లకు అద్దెకు ఇవ్వడంతో పాటు తమ కస్టమర్ల ఫొటో షూట్లు కోసం వీటిని వినియోగిస్తున్నారు. ఫొటోషూట్ల కోసం పెద్ద మొత్తంలో డబ్బులు వెచ్చించి ఎక్కడికో వెళ్లాల్సిన పనిలేకుండా అందుబాటు ధరలో ఈ థీమ్ స్టూడియోల్లో అన్ని వసతులు ఉంటుండటంతో చిన్నారుల తల్లిదండ్రులు, యువత ఇక్కడ ఫొటోషూట్లు చేసుకునేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు.



పోలీస్ స్టేషన్ సెట్‌లో చిన్నారితో తల్లిదండ్రుల ఫొటో షూట్



పల్లె ఇంటి సెట్‌లో పల్లె పడుచు వేషధారణలో చిన్నారి



అవుట్ డోర్‌లో పల్లెటూరి సెట్టింగ్





బర్త్‌డే ఈవెంట్ల కోసం.. బార్ సెట్టింగ్..

తక్కువ బడ్జెట్‌లో షూట్‌లు



ఫొటోషూట్లు కోసం ఎంతో ఖర్చుపెట్టి ఎక్కడెక్కడికో వెళుతున్నారు. తక్కువ బడ్జెట్‌లో మంచి ఫొటోషూట్లు చేసుకునేందుకు వీలుగా అన్ని రకాల సెట్టింగులు, ప్రైవేట్ థియేటర్‌తో భీమవరం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం వద్ద మేజిక్ పిక్చర్‌లాండ్ ప్రారంభించాం. చాలామంది వచ్చి షూట్లు చేసుకుంటున్నారు.

– జి.కృష్ణంరాజు, మాజిక్ పిక్చర్‌లాండ్, భీమవరం

దూర ప్రాంతాలకు వెళ్లే వ్యయం తగ్గింది



భీమవరం చుట్టుపక్కల థీమ్ పార్కులు, స్టూడియోలు ఏర్పాటు చేయడం వల్ల ఫొటోషూట్లకు దూర ప్రాంతాలకు వెళ్లే వ్యయం తగ్గుతుంది. ముఖ్యంగా ప్రీవెడ్డింగ్, పోస్ట్ వెడ్డింగ్, కిడ్స్ ఫొటోషూట్స్‌కు ఈ థీమ్‌పార్కులు చాలా అనువుగా ఉంటున్నాయి. ఎక్కడో ఉన్న లోకేషన్ల కన్నా అందుబాటులో ఉండే ఈ స్టూడియోల్లో చక్కటి ఫొటోలు తీసుకుంటున్నాం.

– బి.రవితేజ, భీమవరం

ఉపాధిలో రూ.2 కోట్లు హాంఫట్

- సామాజిక తనిఖీలో బహిర్గతమైన అవకతవకలు
- చర్యలకు సిఫార్సు చేసిన డ్వామా పీడీ పీ రాము


నూజివీడులో ఆదివారం రాత్రి 11గంటల వరకు ప్రజావేదికను నిర్వహిస్తున్న అధికారులు

నూజివీడు: ఉపాధి హామీ పనుల్లో జరిగిన అక్రమాలను చూసి సాక్షాత్తు డ్వామా పీడీ, విజిలెన్స్ అధికారులు నోరెళ్లబెట్టారు. కూలీలు పనికి రాకుండానే మస్తర్లు వేసి నగదును మెక్కేయడం... వారంలో రెండు రోజులు పనిచేసినా వారం రోజులు పనిచేసినట్లుగా ఆన్‌లైన్ మస్తర్‌లో చూపి డబ్బులు మింగడం.. వంటి అవినీతి పనులకు నూజివీడు ఉపాధిహామీ పథకం కార్యాలయం కేంద్రంగా మారింది. ఏపీడీ, ఎంపీడీఓ (ఉపాధిహామీ పథకం పీఓ), ఏపీఓలు పర్యవేక్షించాల్సి ఉండగా వీరందరూ తమ పనికానట్లుగా నిర్లక్ష్యంగా వదిలేయడంతో టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, ఇంజినీరింగ్ కన్సల్టెంట్‌లు తమ ఇష్టారాజ్యంగా ఉపాధి నిధులను మెక్కేశారు. దీంతో నూజివీడు మండలంలో ఏడాది కాలంలో నిర్వహించిన పనుల్లో దాదాపు రూ.2 కోట్ల నిధులు పక్కదారి పట్టాయి.

సామాజిక తనిఖీలో వెలుగుచూసిన అక్రమాలు

నూజివీడు మండలంలో 2023–24 ఆర్థిక సంవత్సరంలో 2629 పనులను రూ.17.01 కోట్ల ఉపాధి హామీ పథకం నిధులతో చేపట్టి పూర్తి చేశారు. ఈ పనులపై జూలై మొదటి వారం నుంచి గ్రామాల్లో సామాజిక తనిఖీ నిర్వహించి ఈనెల 18, 19 తేదీల్లో స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ప్రజావేదిక నిర్వహించారు. సామాజిక తనిఖీలో వెలుగుచూసిన అవకతవకలను చూసి డ్వామా పీడీ, విజిలెన్స్ అధికారులు మండిపడ్డారు. ఉపాధిహామీ పథకం పనులకు సంబంధించి ఏ ఒక్కరూ కూడా తమ బాధ్యతలు నిర్వర్తించకుండా గాలికివదిలేశారని పీడీ ఆగ్రహం వ్యక్తం చేశారు. 11 మంది ఫీల్డ్ అసిస్టెంట్‌లను సస్పెండ్ చేయాలని, మిగిలిన వారందరికి షోకాజ్ నోటీసులు జారీచేసి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు నివేదికను సమర్పించారు. 11 మందిలో అన్నవరం, యనమదల, ముక్కొల్లుపాడు, రామన్నగూడెం, మిట్టగూడెం, మీర్జాపురం, సుంకొల్లు, పాతరావిచర్ల, సిద్ధార్థనగర్, దిగవల్లి, తుక్కులూరుకు చెందిన ఫీల్డ్ అసిస్టెంట్‌లు ఉన్నారు. పక్కదారి పట్టించిన రూ.2 కోట్లను అవకతవకలకు పాల్పడిన సిబ్బంది నుంచి రికవరి చేయడానికి ఉన్నతాధికారులు చర్యలు తీసుకుంటున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా రెండు రోజుల పాటు ప్రజావేదికను నిర్వహించడం గమనార్హం. చివరకు ఆదివారం రాత్రి 11 గంటలకు ప్రజావేదిక ముగిసింది.

అక్రమాలు జరిగింది ఇలా...

- నిబంధనల ప్రకారం ఒక కుటుంబానికి ఒక జాబ్ కార్డు మాత్రమే ఉండాలి. ఇక్కడ మాత్రం కుటుంబంలో ఆరుగురు ఉంటే ఆరుగిరికి వేర్వేరుగా జాబ్‌కార్డులను జారీ చేశారు. వీరిలో కొందరు పనికి రాకపోయినా వారి పేరున పనికి వచ్చినట్లుగా బ్యాంకు ఖాతాల్లో నగదును జమ చేశారు.
- రహదారుల వెంట, ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలల ఆవరణల్లో మొక్కలు నాటినట్లు రికార్డుల్లో చూపి డబ్బులు ఖర్చుచేశారు. కాని క్షేత్ర స్థాయిలో అసలు మొక్కలే లేవు.
- ఉద్యాన పంటలకు సంబంధించిన నిర్వహణ ఖర్చులను మూడేళ్ల పాటు రైతుల బ్యాంకు ఖాతాలో జమచేయాలి. రైతులకు కాకుండా ఫీల్డ్ అసిస్టెంట్ బినామీలకు జమ చేసుకొని మెక్కేశారు.
- ఎం బుక్‌లో రికార్డు చేయకుండానే లక్షలాది రూపాయలను విడుదల చేసి పంచుకుతిన్నారు. పని ప్రదేశాల్లో చేసిన పనికి సంబంధించిన బోర్డులు పెట్టకుండానే పెట్టినట్లు చూపి నిధులను జేబుల్లో వేసుకున్నారు.
- ఆయిల్‌పామ్, మామిడి తోటల్లో చెట్లకు పాదులు తీయకుండానే తీసినట్లుగా చూపి డబ్బులు చెల్లించారు. కొందరు పనికి రాకుండానే పనికి వచ్చినట్లుగా చూసి ఉపాధి నిధులను కాజేశారు.

పింఛన్‌దారుల్లో 46మంది అనర్హులు

సామాజిక తనిఖీలో భాగంగా పింఛన్‌దారుల విషయమై కూడా గ్రామాల్లో సామాజిక తనిఖీని నిర్వహించారు. ఈ తనిఖీలో మండలంలో 46 మంది అనర్హులుగా గుర్తించారు. వీటిల్లో మహిళలకు కల్లుగీత కార్మికుల పింఛన్‌ను ఇస్తున్నారు. డప్పు కళాకారుల సొసైటీలో సభ్యత్వం ఉండి, వారు ఇచ్చే సర్టిఫికెట్ ఉంటేనే పింఛన్‌ను ఇవ్వాల్సి ఉండగా అవేమీ లేకుండానే పింఛన్‌ను ఇస్తున్నారు. పోలసానపల్లిలో రెండో పెళ్లి చేసుకున్న తరువాత కూడా మహిళ వితంతు పింఛన్‌ను తీసుకుంటోంది. సచివాలయ సిబ్బంది కూడా పింఛన్ నగదును ఆమెకు అందజేస్తున్నారు. పెరాలసిస్ వచ్చి పూర్తిగా మంచంలో ఉండే వారికే రూ.15వేలు పింఛన్ నగదును ఇవ్వాల్సి ఉండగా, తమ పనిని తాము చేసుకునే వారికి కూడా పెరాలసిస్ పింఛన్‌ను ఇస్తున్నారు.

క్లుప్తంగా

శతాధిక వృద్ధురాలి మృతి


పెద్దింట్లమ్మ

ముదినేపల్లి రూరల్: మండలంలోని వైవాకలో శతాధిక వృద్ధురాలు సోమవారం మృతి చెందింది. గ్రామానికి చెందిన తుంగల పెద్దింట్లమ్మ (105) వృద్ధాప్యం కారణంగా మృతి చెందినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. ఆమెకు కుమారుడితో పాటు ముగ్గురు కుమార్తెలున్నారు. పెద్దింట్లమ్మ మరణవార్త తెలిసిన వెంటనే గ్రామస్తులు భారీసంఖ్యలో ఆమె మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

నూజివీడు ట్రిపుల్ ఐటీ ఏఓగా లక్ష్మణరావు


బీ లక్ష్మణరావు

నూజివీడు: నూజివీడు ట్రిపుల్ ఐటీ పరిపాలనాధికారి(ఏఓ)గా బీ లక్ష్మణరావు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. మెకానికల్ ఇంజినీరింగ్ విభాగంలో అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న ఆయన్ను ఉన్నతాధికారులు ఏఓగా నియమించారు. ఏడాది కాలం పాటు ఈ పదవిలో ఆయన కొనసాగనున్నారు. గతంలో ఈయన డీన్ అకడమిక్స్‌గాను, చీఫ్ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ బాధ్యతలను సైతం నిర్వర్తించారు. ఏవోగా బాధ్యతలు స్వీకరించిన లక్ష్మణరావుకు పలువురు సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

సాగునీరు లేక బీటలు వారి..


కొవ్వలిలో బీటలు వారుతున్న పొలాలు

దెందులూరు: సాగునీరందక కొవ్వలిలో వందలాది ఎకరాల్లో పంట పొలాలు బీటలు వారుతున్నాయి. గోదావరికాలువ ఆయకట్టు భూములైన మూడవ నంబరు తూము కింద 596 ఎకరాల సాగుభూమి ఉంది. ఈ పొలాల్లో నాట్లు వేయడంతో పాటు రైతులు ఎరువులు వేసి పనులు కూడా పూర్తిచేశారు. అయితే సాగునీరందక ఆ పొలాలు బీటలు వారుతున్నాయి. రైతు భరోసా అందక అప్పులు చేసి మరీ సాగు పనులు ప్రారంభించినా ప్రకృతి, ప్రభుత్వం సహకరించలేదని రైతులు వాపోయారు. గోదావరి కాలువ చివరి ఆయకట్టు భూములకు పూర్తిస్థాయిలో సాగునీరు సరఫరా చేయాలని రైతులు కోరుతున్నారు.

పాలకోడేరు ఎస్సైగా హరిబాబు


ఎస్సైగా బాధ్యతలు స్వీకరించిన హరిబాబు

సాక్షి స్పందన

పాలకోడేరు: పాలకోడేరు ఎస్సైగా ఎస్ హరిబాబు నియమితులయ్యారు. ఎన్నికల అనంతరం ఎస్సైగా ఎవ్వరినీ నియమించకపోవడంతో ఇక్కడ క్రైమ్ రేటు అధికంగా ఉందని, మోటార్ బైక్‌ల దొంగతనాలు, కొట్లాటలు ఎక్కువగా జరుగుతున్నాయని 'పాలకోడేరు పోలీసు స్టేషన్‌కు ఎస్సై కావలెను' శీర్షికన సాక్షి దినపత్రిక కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన ఉన్నతాధికారులు భీమవరం మహిళా పోలీసు స్టేషన్‌లో పని చేస్తున్న ఎస్.హరిబాబును పాలకోడేరుకు బదిలీ చేశారు. ఎస్సైగా సోమవారం సాయంత్రం బాధ్యతలు స్వీకరించిన హరిబాబును ఏఎస్సై వీఎస్ఎస్ఎన్ మోహనరావు, స్టేషన్ రైటర్, సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

ముసునూరు: ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని ముసునూరు పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై పి.వాసు తెలిపారు. బలివేలోని తమ్మిలేరు ఇసుక ర్యాంపు నుంచి సోమవారం అనుమతి లేకుండా ట్రాక్టర్‌లో ఇసుక లోడ్ చేసి, తరలిస్తున్న ముసునూరుకు చెందిన నక్కా వెంకటేశ్వరరావును గోపవరంలోని నాగేంద్రపురం సెంటర్‌లో ట్రాక్టర్‌తో సహా అదుపులోకి తీసుకుని, పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ట్రాక్టర్ యజమానిపై వాల్టా కేసు నమోదు చేశామన్నారు.


సీనియర్ ఫొటోగ్రాఫర్లకు సత్కారం


భీమవరంలో సీనియర్ ఫొటోగ్రాఫర్లను సత్కరిస్తున్న దృశ్యం

భీమవరం: గత చరిత్రకు చిహ్నాలు ఛాయాచిత్రాలేనని, కెమెరా సృష్టికర్త లూయిస్ డాకురే కెమెరా కనుగొనకపోతే చరిత్రకు చిహ్నాలు లేవని పలువురు వక్తలన్నారు. సోమవారం భీమవరం ఛాంబర్ ఆఫ్ కామర్స్ భవనంలో శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో భీమవరం ఏరియా ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ సహకారంతో ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ ప్రాచీన కాలం నుంచి ఫొటోగ్రఫీకి ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుందని, ఫొటోగ్రఫీని వృత్తిగా చేసుకుని ఎంతోమంది జీవనం సాగిస్తున్నారన్నారు. అనంతరం సీనియర్ ఫొటోగ్రాఫర్లను సత్కరించారు. ఈ కార్యక్రమంలో గాదిరాజు సుబ్బరాజు, అరసవల్లి సుబ్రమణ్యం, అసోసియేషన్ అధ్యక్షుడు తిరుమాని సత్యనారాయణ (చిట్టిబాబు), చైర్మన్ ఎస్ నాగు, చెరుకువాడ రంగసాయి, గంటా చంటి, జంగం మాణిక్యాలరావు, చెక్క శ్రీరామ్మూర్తి, రామాయణం పురుషోత్తం తదితరులు పాల్గొన్నారు.

ఉల్లి లొల్లి మళ్లీ షురూ

- కిలో రూ.50కి చేరిన ఉల్లి ధర
- మహారాష్ట్ర నుంచి తగ్గిన దిగుమతి
- ధర మరింత పెరిగే అవకాశం



తాడేపల్లిగూడెం: ఉల్లి లొల్లి మళ్లీ మొదలైంది. ఉమ్మడి జిల్లాలో ప్రధానమైన తాడేపల్లిగూడెం మార్కెట్‌కు సరుకు రాక తగ్గిపోవడంతో ధరాఘాతం నెమ్మదిగా వినియోగదారులను తాకుతోంది. పంట పండే మహారాష్ట్రలో భారీ వర్షాలు కురవడంతో దిగుబడి తగ్గి ధరపై ప్రభావం చూపించింది. మార్కెట్‌లో గడచిన ఆరు నెలలుగా ఉల్లి ధరల హెచ్చుతగ్గులుగా ఉన్నాయి. ఒక్క మహారాష్ట్ర నుంచి మాత్రమే తాడేపల్లిగూడెంకు సరుకు వస్తోంది. రోజుకు 20 నుంచి 30 లారీల సరుకు రావాల్సి ఉండగా, కేవలం ఏడు నుంచి ఎనిమిది లారీలకే పరిమితమైంది. కర్నూలు రకం ఉల్లిపాయలు మార్కెట్‌కు రావాలంటే ఇంకో నెల ఆగాల్సిందే. మహారాష్ట్రలో సాధారణ రకం క్వింటా రూ.2,919, మధ్యస్థ రకం రూ.3,411, మొదటి రకం రూ.4,500 ధర పలుకుతున్నాయి. రవాణా, ఇతర ఖర్చులు కలిపి రూ.4వేలు ఆపైన గిట్టుబాటు అవుతున్నాయి. రిటైల్‌గా మార్కెట్‌లో ఈ ప్రభావంతో కిలో రూ.50కి చేరుకుంది. ఉల్లి ధరలు పెరగకుండా నియంత్రించేందుకు కేంద్రం చర్యలు తీసుకుంటోంది. వినియోగదారుల డిమాండ్‌కు అనుగుణంగా బఫర్ స్టాక్‌ను గోదాముల్లో లక్షల టన్నుల్లో ఉంచింది. అవసరమైతే ఎగుమతులపై నిషేధం విధించే అవకాశం ఉంది. అయితే నవంబర్ వరకు ఉల్లి ధరల్లో వ్యత్యాసాలు ఉండవచ్చని వ్యాపారులు చెబుతున్నారు.

పశువుల కోసం కాలువలో దిగి వ్యక్తి మృతి


అడపా అంకాలయ్య మృతదేహం

కొయ్యలగూడెం: పశువుల కోసం కొయ్యలగూడెం మండలం రామానుజపురం సమీపంలోని బైనేరు కాలువలో దిగి సోమవారం ఓ వ్యక్తి మృతి చెందాడు. పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు కోనే శ్రీనివాస్ తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన అడపా అంకాలయ్య (55) పశువులను మేపుతూ జీవనం సాగిస్తున్నాడు. సోమవారం ఆవలి వైపు ఉన్న పశువుల వద్దకు చేరుకోవడానికి బైనేరు కాలువను దాటుతూ గల్లంతయ్యాడు. విషయం తెలుసుకున్న పోలీసు, అగ్నిమాపక సిబ్బంది రెవెన్యూ శాఖతో కలిసి గాలింపు చర్యలు చేపట్టారు. తహసీల్దార్ కె.చెల్లన్న దొర, పోలీస్ అధికారులు గజ ఈతగాళ్లతో గాలింపు చర్యలను పర్యవేక్షించారు. ఎట్టకేలకు సమీపంలోని నీటి గుండంలో అంకాలయ్య మృతదేహాన్ని గుర్తించి బయటకు తీశారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. అంకాలయ్యకు భార్య, వివాహితులైన ఇద్దరు సంతానం ఉన్నారు.


బైనేరు కాలువ వద్ద గాలింపు చర్యలను పర్యవేక్షిస్తున్న అధికారులు

లారీ ఢీకొని వైఎస్సార్ విగ్రహం ధ్వంసం


ధ్వంసమైన వైఎస్సార్ విగ్రహం

చింతలపూడి: చింతలపూడి మండలం, రాఘవాపురం సెంటర్‌లో ఉన్న దివంగత ముఖ్యమంత్రి డా వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహాన్ని లారీ ఢీకొట్టడంతో పూర్తిగా ధ్వంసమైంది. స్థానికుల కథనం ప్రకారం ఆదివారం అర్ధరాత్రి పామాయిల్ లోడ్‌తో వెళ్తున్న లారీ ఢీకొట్టిందని, దీంతో విగ్రహం కూలిపోయినట్లు తెలిపారు. గ్రామస్తులు లారీని ఆపి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు అప్రమత్తమై ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా విచారణ జరుపుతున్నారు.

ప్రమాదవశాత్తు కాల్వలో పడి..


కాల్వలో లభ్యమైన శేషయ్య మృతదేహం

దెందులూరు: దెందులూరు– పెరుగ్గూడెంలో పోలవరం కాల్వ అండర్ టెన్నల్‌లో పడి ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాల ప్రకారం.. నల్లజర్ల మండల తెలికిచర్ల గ్రామానికి చెందిన పీ శేషయ్య (45) ఆదివారం రాత్రి చల్లచింతలపూడిలోని పెద్దమ్మ ఇంటికి వచ్చాడు. సోమవారం స్వగ్రామానికి వెళుతూ ప్రమాదవశాత్తు కాల్వలో పడి మృతి చెందాడు. ఎస్సై కే స్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

జిల్లా ఎస్పీ శివకిషోర్


ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో భోజనాన్ని వడ్డిస్తున్న ఎస్పీ శివకిషోర్

ఏలూరు టౌన్: మీ ఫోన్లకు వచ్చే మెస్సేజ్‌లు, లింకులను ఓపెన్ చేయడం ద్వారా సైబర్ నేరగాళ్లు మీ బ్యాంకు ఖాతాల్లోని సొమ్ములను కాజేస్తున్నారని ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఏలూరు జిల్లా ఎస్పీ కొమ్మి ప్రతాప శివకిషోర్ అన్నారు. ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం మీ కోసం ప్రజా ఫిర్యాదుల వేదికలో జిల్లా వ్యాప్తంగా ఆయా ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. ఆయా సమస్యలపై సంబంధిత పోలీస్ అధికారులకు ఫోన్‌లో ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ మీ ఫోన్ నెంబర్‌కు బహుమతులు వచ్చాయనీ, డబ్బులు తప్పుగా మీ ఖాతాలో పడ్డాయనీ, ఓటీపీ చెప్పాలంటూ అనేక మంది సైబర్ మోసగాళ్లు మిమ్మల్ని మాయమాటలు చెప్పి మోసం చేస్తారని.. వాటినుంచి అప్రమత్తంగా ఉండాలని అన్నారు.

స్వయంగా భోజనం వడ్డించిన ఎస్పీ

ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాయంలో జరిగే మీ కోసం కార్యక్రమానికి జిల్లాలోని అనేక ప్రాంతాల నుంచి హాజరైన ప్రజలకు ఏలూరు శ్రీసత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో మధ్యాహ్న భోజన సదుపాయం ఏర్పాటు చేస్తున్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ స్వయంగా ప్రజలకు భోజనం వడ్డించారు. మధ్యాహ్న భోజనాన్ని ఏర్పాటు చేసిన శ్రీ సత్యసాయి సేవాసమితి సంస్థ ప్రతినిధులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఈబీ అదనపు ఎస్పీ నక్కా సూర్యచంద్రరావు ఉన్నారు.

23న ఉపాధి హామీ గ్రామసభలు

ఏలూరు (మెట్రో): జిల్లాలో అన్ని గ్రామాల్లో ఈ నెల 23న గ్రామ సభలు ఏర్పాటుచేసి మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టవలసిన పనులను చర్చించి తీర్మానిస్తామని జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస్ విశ్వనాధ్ తెలిపారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ ద్వారా చేపట్టవలసిన పనులపై రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, రాష్ట్ర పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖా మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ రాష్ట్ర సచివాలయం నుంచి ప్రభుత్వ కార్యదర్శులతో కలిసి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ సామాజిక తనిఖీలో వచ్చిన ఫిర్యాదులపై వెంటనే స్పందించి విచారణ చేసి, చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస్ విశ్వనాధ్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో 4 విభాగాలలో పనులు గుర్తిస్తామన్నారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈఓ కెఎస్ఎస్ సుబ్బారావు, డ్వామా పీడీ రాము, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ సత్యనారాయణ, మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్ట్ పీడీ రవికుమార్, ఉద్యాన వన శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామ్మోహన్ పాల్గొన్నారు.

బంగారానికి మెరుగు పెడతామంటూ మోసం

భీమవరం: బంగారం మెరుగుపెడతామంటు తమను మోసం చేశారని బాధితులు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు భీమవరం టూటౌన్ ఎస్సై ఫాజిల్ రెహమాన్ సోమవారం చెప్పారు. భీమవరం మండలం రాయలం గ్రామానికి చెందిన సీహెచ్ మణి ఇంటికి రెండురోజుల క్రితం బంగారానికి మెరుగుపెడతామంటు ఇద్దరు వ్యక్తులు వచ్చారు. మణి తన కాళ్లపట్టీలను మెరుగుపెట్టమని ఇవ్వగా వాటిని మెరుగుపెట్టి ఇచ్చారు. అనంతరం ఆమె మెడలో 23 గ్రాముల బంగారు చైన్‌కు మెరుగుపెట్టారు. అయితే చైన్ బరువు తగ్గడంతో అనుమానం వచ్చి వారిని నిలదీయగా పారిపోయారు. దీనితో బాధితురాలు భర్త ఇంటికి వచ్చిన తరువాత విషయం చెప్పగా చైన్ తూకం వేయించడంతో దాని బరువు 19 గ్రాములు ఉంది. దీనిపై వారు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రసాయనం.. మోతాదు మీరితే విఘాతం

- వరి సాగులో అధిక రసాయనాలు అనర్థదాయకం
- ఎకరాకు 7 బస్తాల వరకు ఎరువుల వినియోగం
- గుళికలు, పురుగుమందుల వాడకమూ ఎక్కువే
- ఇప్పటికే 2 విడతల్లో ఎరువులు చల్లిన రైతులు
- దిగుబడి పెరిగినా మిగిలేది అంతంతమాత్రమే


సార్వా వరిపైరుపై రసాయనాలు పిచికారీ చేస్తున్న దృశ్యం

భీమవరం: వరిసాగులో అధిక దిగుబడులు సాధించేందుకు రైతులు ఎరువులు, పురుగుమందులు అధికంగా వినియోగిస్తున్నారు. దీంతో భూసారం క్షీణించడమేగాక పంట ఉత్పత్తులను ఆహారంగా తీసుకున్నవారికి కూడా నష్టమేనని వ్యవసాయశాఖాధికారులు హెచ్చరిస్తున్నారు. అధిక ఎరువుల వాడకం వల్ల తాత్కాలికంగా దిగుబడి పెరిగినా.. తరువాత కాలంలో తగ్గిపోయే ప్రమాదముందని వెల్లడిస్తున్నారు. అలాగే పురుగుమందులు పిచికారీ సమయంలో తగిన జాగ్రత్తలు తీసుకోకుంటే అనారోగ్య సమస్యలు తలెత్తే ప్రమాదముందని ఇటువంటి తరుణంలో సేంద్రియ విధానంలో సాగు చేయడం వల్ల పెట్టుబడి ఖర్చు తగ్గడమేగాక రైతులకు, వినియోగదారులకు శ్రేయస్కరమని సూచిస్తున్నారు. జిల్లాలో 2.11 లక్షల ఎకరాల్లో వరిసాగు చేస్తుండగా ముందుగా నాట్లు వేసిన రైతులు ఇప్పటికే రెండు విడతలు ఎరువులు వేయగా ఒక విడత గుళికలు, మరో విడత పురుగుమందుల పిచికారీ పూర్తి చేశారు. అయితే ఇష్టానుసారం పంటలకు మందులు పిచికారీ చేస్తే మంచి జరగడం అటుంచితే దుష్ప్రభావాలే ఎక్కువగా ఉంటాయి. కొంతమంది రైతులు పక్కచేలో రైతులు వాడారని తమ పొలంలో కూడా మందుల దుకాణంలో వ్యాపారులు చెప్పిన మందులు కొనుగోలు చేసి వాడుతుంటారు. ఇలా చేయడం వల్ల భూమి సారం కోల్పోవడమేగాకుండా పంట నష్టపోయే ప్రమాదం ఉంది. అంతేగాకుండా సాగు వ్యయం కూడా పెరుగుతుంది. అవగాహన రాహిత్యంతో తగిన జాగ్రత్తలు తీసుకోకుండా మందులు పిచికారీ చేయడంవల్ల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుంది.

అధిక దిగుబడుల కోసమే

గతంలో వివిధ పంటలసాగులో పశువుల ఎరువును ఎక్కువగా వినియోగించేవారు. అప్పట్లో ఎకరాకు పంట దిగుబడి 20 బస్తాలకు మించి ఉండేది కాదు. అనంతరం దాళ్వా పంటకు మాత్రమే ఎరువులు వినియోగించగా, రానురాను సార్వా పంటలో కూడా ఎరువుల వాడకం పెరిగింది. దీంతో దిగుబడులు పెరుగుతుండడంతో ప్రస్తుతం ఎకరాకు 7 బస్తాల వరకు ఎరువులను వినియోగిస్తున్నారు. అంతేగాకుండా గుళికలు, పురుగుమందుల వాడకం కూడా గణనీయంగా పెరిగింది. ప్రస్తుతం సార్వా పంటలో ఎకరాకు 40 బస్తాలు, దాళ్వా పంటలో 55 బస్తాల వరకు దిగుబడి సాధిస్తున్నా పెట్టుబడులు పెరిగిపోవడంతో రైతులకు మిగిలేది అంతంతమాత్రమే. పంటలు కూడా విషతుల్యంగా మారడంతో ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపిస్తున్నాయి. ఇటువంటి తరుణంలో ఎరువులు, పురుగుమందుల వినియోగాన్ని తగ్గించేందుకు వ్యవసాయశాఖ ప్రత్యేకంగా రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోంది. సేంద్రియ సేద్యాన్ని ప్రోత్సహిస్తున్నారు. పొలంబడి పేరిట గ్రామాల్లో రైతు సమావేశాలు సమావేశాలు ఏర్పాటుచేసి ఎరువులు, పురుగుమందులు అధిక వాడకం వల్ల కలిగే నష్టాలను వివరిస్తున్నారు.

వినియోగం తగ్గించాలి



వరి సాగులో ఎరువులు ఎక్కువగా వాడకం వల్ల ప్రస్తుతం కొంత దిగుబడి పెరిగినా ఆమేరకు ఖర్చు పెరగడం వల్ల రైతులకు ప్రయోజనం ఉండదు. ఎక్కువ మోతాదులో ఎరువులు, పురుగుమందులు వాడడం వల్ల భూసారం క్రమేపి క్షీణించి రైతులు ఇబ్బందులపాలవుతారు. పురుగుమందులు పిచికారీ సమయంలో జాగ్రత్తలు తీసుకోవాలి. వ్యవసాయశాఖాధికారులు సూచించిన మేరకు మిశ్రమం కలిపి పిచికారీ చేయాలి.

– జెడ్.వెంకటేశ్వరరావు, జిల్లా వ్యవసాయశాఖాధికారి, భీమవరం

ఈ-పంటతో రైతులకు మేలు

సబ్ డివిజన్‌లో 16,512 ఎకరాల్లో ఈ-పంట నమోదు

తాడేపల్లిగూడెం రూరల్: రైతాంగం ప్రకృతి విపత్తులు, ఇతర పరిహారాలు, ప్రభుత్వ సబ్సిడీలు పొందాలంటే ఈ-పంట నమోదు తప్పనిసరి అని అధికారులు చెబుతున్నారు. పంట అసలు సాగుదారు పేరున ఈ-పంట నమోదు చేస్తారు. దీనివల్ల భూమి ఉన్న రైతుకు ఎటువంటి ఇబ్బంది ఉండదు. ఇది కేవలం 11 నెలల పంట కాలానికి మాత్రమే పరిమితమవుతుంది. ప్రతి పంట సర్వే నెంబరు ప్రకారం, ఎంత విస్తీర్ణంలో వేశారు? ఏయే రకాలు పండిస్తున్నారు? వంటి వివరాలు ఈ-పంటలో రికార్డు చేస్తార. ఈ-పంట సమాచారం ఆధారంగానే ధాన్యం కొనుగోలు జరుగుతుంది.

16,512 ఎకరాలో ఈ-పంట నమోదు

తాడేపల్లిగూడెం వ్యవసాయ సబ్ డివిజన్ పరిధిలో మొత్తం 55వేల 486 ఎకరాల విస్తీర్ణం ఉంది. తాడేపల్లిగూడెం మండలంలో 24,500, పెంటపాడులో 21 వేలు, గణపవరం మండలంలో 9986 ఎకరాలు వరి విస్తీర్ణం ఉంది. ఇప్పటి వరకు 16,512 ఎకరాల్లో మాత్రమే ఈ-పంట నమోదైందని అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. మరో 38,974 ఎకరాల్లో ఈ-పంట నమోదు చేయాల్సి ఉంది.


తాడేపల్లిగూడెం మండలంలో ఈ-పంట నమోదు చేస్తున్న దృశ్యం

ఈ క్రాప్ నమోదు తప్పనిసరి



రైతులు తమ పంటను ఈ-పంటలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలి. ఈ నెలాఖరు లోపు రైతులు తమ పేర్లు నమోదు చేసుకోవాల్సి ఉంది. తద్వారా ప్రభుత్వ రాయితీలు, పంట నష్టం వంటివి లభిస్తాయి. సకాలంలో రైతులు ఈ-పంట నమోదు చేసుకోవాలి.

– పి.మురళీకృష్ణ, ఏడీఏ, తాడేపల్లిగూడెం

తణుకులో మానవత శాంతి ర్యాలీ


శాంతి ర్యాలీను ప్రారంభిస్తున్న మున్సిపల్ కమిషనర్ బీవీ రమణ

తణుకు టౌన్: మానవత సంస్థ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా తణుకులో ప్రపంచ శాంతి వర్ధిల్లాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. సోమవారం తణుకులోని ఎస్కేఐఎం ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీని తణుకు మున్సిపల్ కమిషనర్ బీవీ రమణ జెండా ఊపి ప్రారంభించారు. ఈ ర్యాలీలో ప్రపంచ శాంతి వర్ధిల్లాలి, ప్లాస్టిక్ నిషేధ, పర్యావరణ పరిరక్షణ, శాంతి నినాదాలతో కూడిన ప్లకార్డులను ప్రదర్శిస్తూ నినాదాలు చేస్తూ ర్యాలీ సాగింది. కార్యక్రమంలో తణుకులోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్, డిగ్రీ కళాశాలల విద్యార్థులు ప్రభుత్వ జూనియర్ కళాశాల నుంచి వెంకటేశ్వర థియేటర్, నరేంద్ర సెంటర్, మున్సిపల్ కార్యాలయం, ఎన్టీఆర్ పార్కు వరకూ ఈ ర్యాలీ సాగింది. ఈ కార్యక్రమంలో మానవత శాంతి ర్యాలీ చైర్మన్ గమిని రాంబాబు, అధ్యక్షురాలు కతారి శారదాదేవి, కార్యదర్శి బి.రామకాశీ, కోశాధికారి అక్కిన కాశీ, ఆనందం మస్తాన్‌రావు, ఎ.బాలాజీ, ఎస్వీ సతీష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా 'నా మొక్క- నా శ్వాస'


మొక్కలు నాటుతున్న ఉమర్ ఆలీషా పీఠం సభ్యులు

అత్తిలి: నామొక్క- నాశ్వాస కార్యక్రమంలో భాగంగా అత్తిలి మండలం పాలూరు గ్రామంలో ఉమర్ ఆలీషా రూరల్ డెవలప్‌మెంట్ ట్రస్టు ఆధ్వర్యంలో సోమవారం మొక్కలు నాటారు. పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలని పిఠాపురం పీఠాధిపతి డాక్టర్ ఉమర్ ఆలీషా ఇచ్చిన పిలుపు మేరకు మొక్కలు నాటామని పీఠం సభ్యులు నందం తాతయ్య, శరకడం వెంకట సత్యనారాయణ తెలిపారు.

సబ్సిడీపై ఆయిల్ పామ్ మొక్కలు


జగ్గన్నపేట గ్రామంలో ఆయిల్‌పామ్ మొక్కలు నాటుతున్న దృశ్యం

తాడేపల్లిగూడెం రూరల్: ఆయిల్‌పామ్ సాగు విస్తీర్ణాన్ని పెంచడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీపై రైతులకు ఆయిల్‌పామ్ మొక్కలను అందజేస్తుందని జిల్లా ఉద్యాన శాఖ అధికారి దేవానంద్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని జగ్గన్నపేట గ్రామంలో రైతు పులి సూర్యప్రసాద్ వ్యవసాయ క్షేత్రంలో ఆయిల్‌పామ్ మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా దేవానంద్ కుమార్ మాట్లాడుతూ ఆయిల్ పామ్ మొక్కలు హెక్టారుకు రూ.29 వేలు, నాలుగేళ్ల పాటు ఏడాదికి ఎరువులు, అంతర పంటకు రూ.10,500 రాయితీ ఇస్తుందన్నారు. ఆసక్తి ఉన్న రైతులు రైతు సేవా కేంద్రాల్లో తమ పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. మండల ఉద్యాన శాఖ అధికారి శ్రీలక్ష్మి, త్రీఎఫ్ డీజీఎం విజయ్‌ప్రసాద్, యుహెచ్‌ఏ ఉదయ్, రైతులు దుట్టా ఏడుకొండలు, సత్యనారాయణ, మద్దిపాటి వివి.సత్యనారాయణ, జుజ్జవరపు కృష్ణ, ఘంటా కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రమజీవులకు న్యాయమైన వాటా దక్కాలి


పోస్టర్ విడుదల చేస్తున్న ఏఐటీయూసీ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): కార్పొరేట్ కంపెనీ లాభాల్లో శ్రమ జీవులకు న్యాయమైన వాటా దక్కే వరకు పోరాటాలు సాగించాలని ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షులు డి.సోమసుందర్ పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 1,2,3 తేదీల్లో విశాఖపట్నంలో జరగనున్న ఏఐటీయూసీ జాతీయ సమ్మేళనాల వాల్ పోస్టర్‌ను సోమవారం పట్టణంలో ఏఐటీయూసీ నాయకులు విడుదల చేశారు. సోమసుందర్ మాట్లాడుతూ విశాఖలో జరిగే జాతీయ సమ్మేళనంలో కార్మిక వర్గానికి సంబంధించి కీలక అంశాలపై చర్చిస్తారని, కార్పొరేటు కంపెనీల సంపదను పునః పంపిణీ చేయాలన్న డిమాండ్‌పై భవిష్యత్తు కార్యచరణ రూపొందిస్తారని చెప్పారు. ఏరియా కమిటీ అధ్యక్షులు ఓసూరి వీర్రాజు, సభ్యులు మందలపర్తి హరీష్, వివిధ యూనియన్ల నాయకులు కళింగ లక్ష్మణరావు, తాడికొండ శ్రీనివాసరావు, పోలిరాతి ఆదినారాయణ పాల్గొన్నారు.

అథ్లెట్ జ్యోతిక శ్రీకి అభినందన


అథ్లెట్ దండి జ్యోతిక శ్రీని అభినందిస్తున్న బీజేపీ నాయకులు

తణుకు టౌన్: ఇటీవల ప్యారిస్‌లో నిర్వహించిన ఒలింపిక్ 2024 క్రీడల్లో తణుకు పట్టణానికి చెందిన దండి శ్రీనివాసరావు కుమార్తె దండి జ్యోతికశ్రీ అథ్లెటిక్స్ 400 రిలేలో పాల్గొనడం ఎంతో అభినందనీయమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ చెప్పారు. సోమవారం బీజేపీ నాయకులు జిల్లా అధ్యక్షుడు నార్ని తాతాజీ ఆధ్వర్యంలో జ్యోతిక శ్రీని ఆమె నివాసంలో కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా తాతాజీ మాట్లాడుతూ సాధారణ కుటుంబంలో పుట్టిన జ్యోతిక శ్రీ అథ్లెటిక్స్‌లో రాష్ట్ర, జాతీయ స్థాయిలను దాటుకుని అంతర్జాతీయ క్రీడా పోటీలలో భారతదేశం తరపున పాల్గొనడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో నియోజక వర్గ కన్వీనర్ ఐనంపూడి శ్రీదేవి, పట్టణ అధ్యక్షుడు పెదమల్లు అవినాష్‌కాంత్, ప్రధాన కార్యదర్శి బొల్లా నాగరాజు, ఉపాధ్యక్షుడు రాసాబత్తుల అనుకుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి విద్యార్థీ సంస్కృత భాషను నేర్చుకోవాలి


బల్లిపాడులో మాట్లాడుతున్న హెచ్‌ఎం బాలసుబ్రహ్మణ్యం

అత్తిలి: ప్రతి విద్యార్థీ సంస్కృత భాషను నేర్చుకుంటే భారతీయ భాషలన్నీ సులభంగా అర్థం అవుతాయని హెచ్‌ఎం సీహెచ్ బాలసుబ్రహ్మణ్యం అన్నారు. సోమవారం అత్తిలి మండలం బల్లిపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో సంస్కృత భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సంస్కృత భాష ఉపాధ్యాయులు ఎస్.పురుషోత్తం మాట్లాడుతూ సంస్కృత భాషలో మన సంస్కృతి ఉందని, విద్యార్థుల చిన్నతనం నుంచే సంస్కృత భాషను అభ్యసించాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి.రాంబాబు, ఆత్మలింగం, శ్రీకాంత్, సుజాతదేవి, శ్రీహర్ష, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

అత్తిలి: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతీ ఒక్కరూ మొక్కలు నాటాలని కళాశాల కరస్పాండెంట్ మద్దాల వెంకటేశ్వరరావు అన్నారు. అత్తిలి ఎస్వీఎస్ఎస్ డిగ్రీ కళాశాల జాతీయ సేవా పథకం వలంటీర్లు ఉపాధి హామీ పథకం కింద సోమవారం కళాశాల ప్రాంగణంలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో ఉపాధి హామీ పథకం అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి ప్రసాద్, జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ రమణమూర్తి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ బి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు

తాడేపల్లిగూడెం రూరల్: పశుసంవర్ధక శాఖ తాడేపల్లిగూడెం డివిజన్ పరిధిలో మంగళవారం నుంచి పాడి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ కార్యక్రమం నిర్వహించనున్నట్టు పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ సుధాకర్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. డివిజన్ పరిధిలో 95,500 డోసుల టీకాలు వేయనున్నట్టు తెలిపారు. ఆర్‌ఎస్‌కేలలో ఉన్న పశువైద్య సహాయకులు బృందాలుగా ఏర్పడి టీకాలు వేస్తారన్నారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

21న ఆక్వా రంగంపై అవగాహన సదస్సు

ఆకివీడు: ఆక్వా రంగంపై అవగాహన సదస్సు ఈ నెల 21న స్థానిక ప్రభుత్వ ఆక్వా లాబ్ , శిక్షణా కేంద్రంలో నిర్వహించనున్నట్టు మండల మత్స్యశాఖ అధికారి సీహెచ్.రాంబాబు సోమవారం చెప్పారు. ఎంపెడా, అప్సడా రిజిస్ట్రేషన్ల కార్యక్రమం ఉంటుందని, అనంతరం ఆక్వా సాగులో మేలైన యజమాన్య పద్ధతులు, మందుల వినియోగం, మేతల వినియోగంపై రైతుల్లో అవగాహన కల్పిస్తారని చెప్పారు. కార్యక్రమానికి ఎంపెడా, అప్సాడా అధికారులు హాజరవుతారన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని రాంబాబు సూచించారు.

శాశ్వత నిత్యాన్నదానానికి విరాళం

భీమవరం(ప్రకాశం చౌక్): శ్రీ మావుళ్లమ్మ సన్నిధిలో నిర్వహిస్తున్న శాశ్వత నిత్యాన్నదానానికి సోమవారం పట్టణానికి చెందిన నాగశివ సాయితేజ, మౌనిక దుర్గా సాయివాసవీ దంపతులు రూ.56001 విరాళంగా అందజేశారు. వారికి ఆలయ ప్రధానార్చకులు బ్రహ్మశ్రీ మద్దిరాల మల్లికార్జున శర్మ పూజలు నిర్వహించి, ప్రసాదాలు అందజేశారు. ఆలయ సహాయ కమిషనర్ బుద్ధ మహాలక్ష్మి నగేష్, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా రక్షా బంధన్ వేడుకలు


భవిత కేంద్రంలో దివ్యాంగులకు బహుమతులు అందజేస్తున్న జిల్లా సక్షమ్ సభ్యులు


తణుకులో సతీష్‌కుమార్‌కు రాఖీ కడుతున్నదివ్యాంగులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక సుబ్బారావుపేట భవిత సెంటర్‌లో సక్షమ్ ఆధ్వర్యంలో సోమవారం రక్షా బంధన్ వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లా సక్షమ్ అధ్యక్షులు కేఎస్‌కేఎస్ అప్పారావు, కోశాధికారి దుర్గారావు, సంయుక్త కార్యదర్శి విజయలక్ష్మిలు దివ్యాంగులకు రక్షా బంధన్ విశిష్టతను తెలియజేశారు. విద్యార్థులకు రాఖీలు కట్టి, మిఠాయిలు పంచారు. బహుమతులు అందజేశారు. ప్రత్యేక ఉపాధ్యాయులు ఎస్‌కే బాలీశ్వరయ్య, ఎం.చంద్రకుమారి, హెచ్‌ఎం బి.జ్యోతి పాల్గొన్నారు.

తాడేపల్లిగూడెంలో..

తాడేపల్లిగూడెం రూరల్: తాడేపల్లిగూడెం పట్టణ, పరిసర గ్రామాల్లో రాఖీ పండుగను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ ఏడాది రాఖీ పౌర్ణమి సోమవారం మధ్యాహ్నం నుంచి వచ్చిందంటూ పండితులు చెప్పడంతో సందిగ్ధంలో పడ్డారు. అయితే, సోదర బంధానికి ముహూర్తాలతో సంబంధం లేదన్నట్టుగా పలువురు అక్కాచెల్లెళ్లు తమ సోదరులకు సోమవారం ఉదయాన్నే రాఖీలు కట్టి సోదర బంధాన్ని చాటి చెప్పారు. పలువురు సోమవారం మధ్యాహ్నం నుంచి రాఖీ పండుగను నిర్వహించారు.

తణుకులో..

తణుకు అర్బన్: రాఖీ పౌర్ణమిని తణుకు దివ్యాంగుల సమాఖ్య సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక జెడ్పీ బాయ్స్ హైస్కూలు ఆవరణలో నిర్వహించిన వేడుకల్లో డాక్టర్ పీఎస్ఎస్ కిరణ్ చారిటబుల్ ఫౌండేషన్ చైర్మన్ బొల్లా సతీష్‌కుమార్‌కు దివ్యాంగ మహిళలు రాఖీలు కట్టి మిఠాయిలు తినిపించారు. సంఘం అధ్యక్షులు వేంద్ర లక్ష్మణ్ పాల్గొన్నారు.

వివిధ పాఠశాలల్లో..

తణుకు టౌన్/తణుకు: అన్నాచెల్లెళ్ల ఆత్మీయతకు ప్రతీకగా నిలిచే రక్షా బంధన్ వేడుకలను తణుకు మండలంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. సోమవారం రక్షా బంధన్ సందర్భంగా గ్రామాల్లోని వివిధ పాఠశాలల్లోని విద్యార్థినులు తమ సహచర విద్యార్థులకు రాఖీలు కట్టారు. తణుకు మండలం తేతలి, దువ్వ, వేల్పూరు, తదితర గ్రామాల్లోని ఉన్నత పాఠశాలల్లో ఈ రక్షా బంధన్ వేడుకలు నిర్వహించారు.

మాంటిస్సోరి స్కూల్‌లో రాఖీ వేడుకలు


మాంటిస్సోరి స్కూలులో రాఖీలు కడుతున్న దృశ్యం

తణుకు: రాఖీ పౌర్ణమి పురస్కరించుకుని తణుకు మాంటిస్సోరి స్కూలులో సోమవారం విద్యార్థులు ఒకరినొకరు రాఖీలు కట్టుకుని భారతీయ సంస్కృతి, విలువలను చాటిచెప్పారు. ఈసందర్భంగా స్కూలు డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు మాట్లాడుతూ భారతీయ సంస్కృతిని విద్యార్థులకు తెలియజేసే ప్రతి కార్యక్రమాన్ని తమస్కూలులో నిర్వహిస్తామన్నారు.

ఈ-క్రాప్ నమోదు చేయించుకోవాలి

అత్తిలి: ఈ-క్రాప్ నమోదు ప్రక్రియ మండలంలోని అన్ని రైతు సేవా కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయశాఖాధికారి టీకే రాజేష్ చెప్పారు. ఈ-క్రాప్ నమోదులో భాగంగా గ్రామాల్లో రైతులు వారి పొలంలో ఎంత విస్తీర్ణంలో పంటసాగు చేసారో? ఏ రకం సాగు చేస్తున్నారో? నమోదు చేస్తారన్నారు. ఈ-పంట, ఈ-కేవైసీ చేయించుకున్న రైతులకే ధాన్యం అమ్మడం, పంటనష్ట పరిహారం, సున్నావడ్డీ, పంటల బీమా వర్తిస్తాయన్నారు.

రోగులకు సత్వర వైద్య సేవలను అందించాలి


వైద్యులతో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌చార్జ్ మలేరియా ఆఫీసర్ డాక్టర్ రవికుమార్

తణుకు అర్బన్: వివిధ రుగ్మతలతో ఆస్పత్రులకు వచ్చే రోగులకు సత్వర వైద్యసేవలందించాలని జిల్లా ఇన్‌చార్జ్ మలేరియా ఆఫీసర్ డాక్టర్ కేజేఎస్ రవికుమార్ అన్నారు. తణుకు మున్సిపాలిటీ పరిధిలోని బ్యాంక్ కాలనీ, ఎన్‌జీఓస్ కాలనీ, కొమ్మాయి చెరువు ప్రాంతాల్లో ఉన్న అర్బన్ హెల్త్ సెంటర్‌లను సోమవారం సందర్శించారు. ఈ సందర్భంగా జ్వరాలతో వచ్చే రోగులకు అవసరమైన పరీక్షలు నిర్వహించి తగిన మందులు అందజేయాలని సూచించారు. జ్వరాలను అశ్రద్ధ చేయకుండా ఆస్పత్రికి వచ్చి చూపించే విధంగా రోగులకు అవగాహన కల్పించాలని కోరారు. ముందుగా హెల్త్ సెంటర్స్‌లో ఉన్న సౌకర్యాలు, ల్యాబ్స్‌లను పరిశీలించి రికార్డులను తనిఖీ చేశారు.

గెస్ట్ ఫ్యాకల్టీ నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

తణుకు: స్థానిక చిట్టూరి ఇంద్రయ్య మెమోరియల్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియేట్ ఒకేషనల్ కోర్సులైన సివిల్ ఇంజినీరింగ్ టెక్నీషియన్, మెకానికల్ అండ్ ఆటోమొబైల్ ఇంజినీరింగ్ టెక్నీషియన్ బోధించడానికి గెస్ట్ ఫ్యాకల్టీ ప్రాతిపదికన జూనియర్ లెక్చరర్‌గా పని చేసేందుకు అర్హత కలిగిన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపల్ జి.ప్రభాకరరావు తెలిపారు. సంబంధిత బీటెక్ బ్రాంచిలో యాభై శాతం కలిగి ఉండాలన్నారు. ఈ నెల 28 వరకు దరఖాస్తులు స్వీకరించిన అనంతరం 30న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు. మరిన్ని వివరాలకు కళాశాల ప్రిన్సిపల్ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

అర్జీలు గడువులోపు పరిష్కరించాలి

భీమవరం: అర్జీదారుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి, చట్ట పరిధిలో చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) వి.భీమారావు పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ×ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన ఫిర్యాదులు స్వీకరించి మాట్లాడారు. జిల్లాలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల అర్జీలను స్వీకరించి, వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ×ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా వచ్చిన ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించి, బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలని పోలీస్ అధికారులను ఆదేశించారు.

నిట్ ఏపీ ఫలితాల్లో మాంటిస్సోరి విద్యార్థి ప్రతిభ


తణుకులో శశిభూషణ్‌ను అభినందిస్తున్న ప్రకాశరావు

తణుకు: తణుకు పట్టణానికి చెందిన మాంటిస్సోరి స్కూలు పూర్వ విద్యార్థి శశిభూషణ్ ఇటీవల నిర్వహించిన నిట్ ఏపీ పరీక్షా ఫలితాల్లో 9.63 జీపీఏ సాధించినట్లు స్కూలు డైరెక్టర్ అనపర్తి ప్రకాశరావు తెలిపారు. నాలుగో తరగతి నుంచి పదో తరగ తి వరకు మాంటిస్సోరిలో చదివిన శశిభూషణ్ గోల్డ్ మెడల్‌తోపాటు కంప్యూటర్ విభాగంలో మరో గోల్డ్ మెడల్ సాధించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా సోమవారం స్కూలు ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో శశిభూషణ్‌కు రూ. 10 వేలు నగదు అందజేశారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు సుబ్బారావు, నాగపద్మిని పాల్గొన్నారు.

మీకోసంలో ఐదు అర్జీలు

ఆకివీడు: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీ కోసం కార్యక్రమానికి ప్రజల నుంచి ఐదు అర్జీలు అందినట్లు ఎంపీడీఓ కందుల వాణి సోమవారం చెప్పారు. స్థల వివాదం, సరిహద్దు తగాదా, చేపల చెరువు భూమిని మ్యూటేషన్ చేయాలని, సర్వే నంబర్ ప్రకారం భూమి అప్పగించాలని తదితర ఫిర్యాదులు అందాయని తెలిపారు.

క్లుప్తంగా

వైభవంగా శ్రావణ పౌర్ణమి పూజలు


సర్వమంగళ అమ్మవారు

తాడేపల్లిగూడెం (టీఓసీ): స్థానిక శంకరమఠంలో ఉన్న శ్రీ ఉమా చంద్రమౌళీశ్వర స్వామి, సర్వమంగళ అమ్మవారికి సోమవారం శ్రావణ పౌర్ణమి సందర్భంగా విశేష అర్చనలు నిర్వహించారు. అమ్మవారిని రజిత కవచాలంకృత సర్వమంగళ అమ్మవారిగా విశేష అలంకరించారు. ఆదిశంకరాచార్య స్వామికి విశేష అర్చనలు నిర్వహించారు.

ఆడబిడ్డలను రక్షించాలి


మానవహారం నిర్వహిస్తున్న అంగన్‌వాడీలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): కోల్‌కతాలో ట్రైనీ డాక్టర్ హత్యను ఖండిస్తు సోమవారం అంగన్‌వాడీలు ఆధ్వర్యంలో పట్టణ తాలూకా ఆఫీస్ సెంటర్‌లో నిరసన ర్యాలీ, మానవహారం నిర్వహించారు. ఐసీడీఎస్ ప్రాజెక్టు అధ్యక్షురాలు దీన స్వరూప రాణి మాట్లాడుతూ ఇంట్లో సొంత ఆడబిడ్డలు మాదిరిగానే సమాజంలోని ప్రతి ఒక్క బాలిక, యువతీ, మహిళను చూడాలన్నారు. అనంతరం వాహనదారులకు, పోలీస్‌లకు రాఖీలు కట్టారు. దుర్గ, ప్రసన్న, వరలక్ష్మి, ప్రభరాణి, గాయత్రీ, వీరమ్మ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు తదితరులు పర్యవేక్షించారు.

చర్మకారుల సంఘం అధ్యక్షుడిగా సంజీవ్


పట్టణ చర్మకారుల సంఘ సమావేశం నూతన కమిటీ సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పట్టణ చర్మకారుల సంఘం అధ్యక్షుడిగా కిల్లాడి సంజీవ్ ఎన్నికయ్యారు. యాగర్లపల్లి కమ్యూనిటీ హాల్ వద్ద జరిగిన సంఘ సమావేశంలో సభ్యులను ఎన్నికున్నారు. ఉపాధ్యక్షుడిగా గొట్టేటి ఏసు, సెక్రటరీగా అజారు ముత్యాలు, సభ్యులుగా గోర్తి ఆనంద్, కూరాకుల మహంకాళిరావు, గోర్తి సోమయ్య, కూరాకుల ముత్యాలరావు, యజ్జల చిన్న నాగేశ్వరరావు, యందం వీర్రాజు, కిల్లాడి రాజారావు తదితరులను ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడు యందం గాంధీ అధ్యక్షత ఈ ఎన్నికలు నిర్వహించారు.

ఆర్‌జీఎస్‌ఏ రిఫ్రెషర్ శిక్షణ


ఇరగవరం ఎంపీడీఓ కార్యాలయంలో శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

ఇరగవరం: స్థానిక కార్యాలయంలో సోమవారం ఆర్‌జీఎస్‌ఏ రిఫ్రెషర్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఎ.శ్రీనివాస్ మాట్లాడుతూ మూడు రోజుల పాటు ఈ శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. ఈ శిక్షణ తరగతుల్లో మొదటి రోజు గ్రామ పంచాయతీల నిర్వహణ, సాలిడ్ వేస్ట్ మేనేజ్‌మెంట్, జీపీడీపీ స్క్రూటినీ అంశాల పై అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ పీవీ నరసింహమూర్తి పాల్గొన్నారు.

అత్తిలిలో..

అత్తిలి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ సర్పంచ్‌లు, కార్యదర్శులకు పారిశుద్ధ్యం, సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్, వీధి దీపాలు తదితర అంశాలపై శిక్షణ కార్యక్రమాన్ని ఎంపీపీ సుంకర నాగేశ్వరరావు సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సీహెచ్ శ్రీనివాసబాబు, ఈఓఆర్డీ శ్రీనివాస్, ఏఓ వి.రామారావు పాల్గొన్నారు.

ఎంపీడీఓకు వీడ్కోలు సత్కారం


అత్తిలిలో ఎంపీడీఓను సత్కరిస్తున్న మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది

అత్తిలి: సాధారణ బదిలీల్లో భాగంగా ఇప్పటి వరకు అత్తిలి ఎంపీడీఓగా పని చేసిన సీహెచ్ శ్రీనివాసబాబు సోమవారం ఏలూరు జిల్లా పోలవరానికి బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఎంపీడీఓకు మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ సుంకర నాగేశ్వరరావు, కార్యాలయ సిబ్బంది, కార్యదర్శులు పాల్గొన్నారు. అనంతరం అత్తిలి ఎంపీడీఓగా ఎండీ అమీలు జమా బాధ్యతలు స్వీకరించారు.